క్లుప్తంగా

దాసాంజనేయుడి హుండీ ఆదాయం రూ. 8లక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు రూ. 8.83లక్షలు వచ్చాయి. మాచవరం, శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో సోమవారం ధర్మకర్తల మండలి సమక్షంలో శ్రీ గుంటూరు సీతారామయ్య అన్న సత్రం, కార్య నిర్వహణాధికారి బి. సుబ్బారెడ్డి, దాసాంజనేయస్వామివారి దేవాలయం కార్యనిర్వహణాధికారి నాగినేని పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో పై ఆదాయంతో పాటు 101 అమెరికన్ డాలర్లు కూడా వచ్చాయి. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కసపర్తి కొండలరావు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా ఉందని వక్ఫ్‌బోర్డు కృష్ణా జిల్లా చైర్మన్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఇస్లాంపేట మినార్ మసీదులో సోమవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందుకు గౌస్ మొహిద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముస్లింల అభ్యున్నతికి వైఎస్ జగన్ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అంతేకాకుండా అనేక పదవులను ముస్లిం మైనార్టీలకు అందించి గౌరవించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మసీద్ ప్రెసిడెంట్ షరీఫ్, వైస్ ప్రెసిడెంట్ మక్బూల్, సెక్రటరీ అలీ, షబ్బీర్ మొహమ్మద్, అబ్దుల్ షబ్బీర్, ఛాన్ భాయ్, అజ్మల్ పాల్గొన్నారు.

సహస్ర చండీ యాగానికి భూమిపూజ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఏప్రిల్ 27వ తేదీ నుంచి మే 3వ తేదీ వరకు శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే సహస్ర చండీ యాగానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. పాలప్రాజెక్టు నైనవరం ఫ్లై ఓవర్ దిగువన ఉన్న ఖాళీ స్థలంలో సోమవారం పీఠాధిపతి కరుమారి దాసు భూమి పూజ నిర్వహించారు. సహస్ర చండీ యాగానికి వందలాది మంది ఉభయదాతలు పాల్గొనే అవకాశం ఉండటంతో భారీ షెడ్డు నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. యాగ ప్రాంగణంలో 72 అడుగుల ఎత్తులో మహా చండీ నిలువెత్తు మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఠానికి చెందిన పలువురు భక్తులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఓం టర్నింగ్ వద్ద కుప్పకూలిన లైటింగ్ స్టాండ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):సోమవారం సాయంత్రం వీచిన భారీ గాలులకు ఇంద్రకీలాద్రిపై ఓం టర్నింగ్ వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్ స్టాండ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. మహా శివరాత్రిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంతో పాటు ఘాట్‌రోడ్డులో లైటింగ్‌తో దేవతా రూపాలను ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం ఓం టర్నింగ్ వద్ద కర్రలతో కట్టిన లైటింగ్ స్టాండ్ కొండ దిగువకు ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో భారీ శబ్దం రావడంతో భక్తులు ఏం జరిగిందో అర్థం కాక కంగారుపడ్డారు. కొండ దిగువన భక్తులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఘనంగా భారతీతీర్థ స్వామి జన్మదిన వేడుకలు



విజయవాడకల్చరల్: శృంగేరీ పీఠాధిపతి భారతీతీర్థ స్వామి 73 జన్మదిన వేడుకలను దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రుత్వికులు లోక కల్యాణార్థం గురువందనంతో ప్రారంభించి శ్రీ సూర్యనారాయణ స్వామి వారికి అర్చన, మహాసౌరం, అరుణ పారాయణ, సూర్య నమస్కారాలు, సౌరష్టాక్షరీ మంత్రజపం, ఆయుష్యహోమం, మృత్యుంజయ హోమం వైభవంగా నిర్వహించారు. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ.. శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి వారి ఆదేశంతో జనవరి 16వ తేదీన వైదిక కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. 73 రోజులుగా నిర్వహిస్తున్నామని, 29వ తేదీ బుధవారం అరుణ హోమంతో కార్యక్రమాలు ముగిస్తాయన్నారు. వేద ధర్మరక్షణకు శృంగేరీ పీఠం కృషి చేయడంతో పాటు వేద పాఠశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రం పాలక మండలి సభ్యుడు గండూరి చంద్రమౌళీశ్వర శర్మ పాల్గొన్నారు.

• ఫుడ్ కోర్ట్.. ఘుమఘుమలు



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం సమీపంలో ఉన్న ఈట్ స్ట్రీట్ నగర వాసులను ఆకర్షిస్తోంది. ప్రతి రోజు రాత్రి 9 గంటల నుంచి నిర్వహించే ఈ ఫుడ్ కోర్టులో వివిధ రకాలైన వెజ్, నాన్ వెజ్ బిర్యానీలు, ఫలుదాలతో పాటు చైనీస్ వంటకాలు ఘుమఘుమలాడుతుండడంతో భోజన ప్రియులు బారులు తీరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.







కార్పెంటర్ల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు



కార్పెంటర్ రామాచారిని సత్కరిస్తున్న శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విశ్వబ్రాహ్మణ సామాజికవర్గ కుల వృత్తుల్లో ఒకటైన కార్పెంటర్ల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటు అందిస్తున్నారని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. సోమవారం కార్పెంటర్ డే సందర్భంగా గొల్లపూడి పరిధిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల ఆయన కార్యాలయంలో సీనియర్ కార్పెంటర్ సంగోజు రామాచారికి చిరు సత్కారం చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కార్పెంటర్లందరూ ఆధునిక యంత్రాలపై శిక్షణ పొంది వృత్తిలో రాణించాలని కోరారు. జగనన్న తోడు పథకం ద్వారా కార్పెంటర్లకు రుణాలను అందిస్తుందని, తద్వారా జీవనోపాధి పొందవచ్చన్నారు. వృత్తిలో భాగంగా కార్పెంటర్ల చేతి వేళ్లకు తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయని, ఇందులో 10 రకాల చికిత్సలను ప్రభుత్వం ఆరోగ్యశ్రీలోకి చేర్చిన విషయాన్ని వారికి గుర్తు చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కోసూరు రమేష్, బోగేశ్వరరావు, సతీష్, సుబ్రహ్మణ్యం, యువజన సంఘం నాయకులు గానుగుల రాజు, అవినాష్ పాల్గొన్నారు.

నవమి వేడుకలకు అంకురార్పణ



విశేష అలంకారంలో స్వామి అమ్మవార్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కొత్తగుళ్ల ప్రాంగణంలో వేం చేసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి వారి శ్రీరామనవమి వేడుకలకు సోమవారం అంకురార్పణ చేశారు. స్వామి వారికి వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ కన్యకా పరమేశ్వరి రామ నగరేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానంలో శ్రీ రామనవమి ఉత్సవాలకు ప్రత్యేక వైదిక కార్యక్రమాలతో శ్రీకారం చుట్టారు. ఉదయం స్వామి వారి మూలమూర్తులకు ప్రత్యేక తిరుమంజనం చేశారు. అందులో భాగంగా సీతా, లక్ష్మణ సమేత కోదండరామస్వామివారికి వివిధ సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అర్చన జరిపారు. అనంతరం స్వామి వారిని పెండ్లికుమారునిగా, సీతమ్మను పెండ్లి కుమార్తెగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం వైదిక కార్యక్రమాల్లో భాగంగా విష్వక్సేనారాధనతో పూజలకు శ్రీకారం చుట్టారు. అనంతరం పుణ్యాహవాచనం, అఖండదీపారాధన తదితర కార్యక్రమాలను నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అదేవిధంగా రక్షాబంధనం, ఋత్విగ్వరణ తదితర కార్యక్రమాలను జరిపారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకు లు పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యు లు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. వచ్చే నెల 7వ తేదీ వరకూ స్వామి వారి నవమి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ తెలిపింది.

ఎన్ఈపీతో పేదలకు విద్య దూరం



సదస్సులో మాట్లాడుతున్న వి.పి.సాను

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం–2020(ఎన్ఈపీ)ను తీసుకొచ్చి పేదలకు విద్యను దూరం చేసిందని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు వి.పి.సాను విమర్శించారు. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ అధ్యక్షతన 'నూతన జాతీయ విద్యా విధానం – విద్యారంగంపై ప్రభావం, ప్రత్యామ్నాయ విద్యావిధానం' అంశంపై సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తీసుకొచ్చిన ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని సాను ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాల పరిధిలో ఉన్న విద్యను ఇందిరాగాంధీ ఉమ్మడి జాబితాలో చేరిస్తే ప్రధాని మోదీ ఎన్ఈపీతో కేంద్రం చేతుల్లోకి లాక్కుందన్నారు. దీంతో రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకు కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. ఎన్ఈపీ అమలు తర్వాత పాఠ్యాంశాలలో అశాస్త్రీయ భావాజాలాన్ని, చరిత్రను వక్రీకరిస్తున్నారని వాపోయారు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం, ఒకే సంస్కృతి చివరికి ఒకే పార్టీ, ఒకే నాయకుడు అనే నినాదం వెనుక ఆర్ఎస్ఎస్ కుట్ర దాగి ఉందని, ఇది ప్రజాస్వామానికి తీవ్ర విఘాతం అని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్ఈపీని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టంచేశారు. ఎన్ఈపీకి ప్రత్యామ్నాయంగా అందరికీ అందుబాటులో ఉండే శాస్త్రీయ విద్యా విధానంపై అఖిల భారత మహాసభలో డ్రాఫ్ట్ తయారుచేశామని తెలిపారు. ఈ డ్రాఫ్ట్ ఎస్ఎఫ్ఐ సీఈసీ వెబ్‌సైట్ అందుబాటులో ఉందని, అందరూ చదివి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ, కాషాయికరణ, కేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. అందరూ ముక్త కంఠంతో ఎన్ఈపీని వ్యతిరేకించాలని, ఎస్ఎఫ్ఐ తీసుకొచ్చిన ప్రత్యామ్నాయ విద్యా విధానం అమలుకు కృషి చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, సీహెచ్ ప్రణీత, రాజ్‌కుమార్, మధన్, ప్రశాంత్, సుష్మ పాల్గొన్నారు.

• కాలి బాటపై గాఢ నిద్ర



విజయవాడ నగరంలో మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఫుట్‌పాత్ యాచకుల గాఢ నిద్రకు కేరాఫ్‌గా మారింది. రాత్రి వేళల్లో పెద్ద సంఖ్యలో యాచకులు ఫుట్ పాత్‌పై నిద్రిస్తున్న దృశ్యాన్ని సాక్షి 'క్లిక్'మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.

వెలంపల్లి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



తోపుడు బండ్లు అందజేస్తున్న కొనకళ్ల విద్యాధరరావు, నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వెలంపల్లి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు అన్నారు. వెలంపల్లి ఫౌండేషన్ చైర్ పర్సన్ సాయి అశ్విత పుట్టినరోజును పురస్కరించుకొని ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు పేద చిరు వ్యాపారులకు సోమవారం తోపుడుబండ్లు పంపిణీ చేశారు. వెలంపల్లి శ్రీనివాసరావు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కొనకళ్ల మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును ఆయా డివిజన్లలోని చిరు వ్యాపారులు కలిసి తోపుడు బండ్లు కావాలని విజ్ఞప్తి చేయగా ఆయన ఆదేశాల మేరకు పలువురికి బండ్లను అందించామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వెలంపల్లి రాఘవ నర్సింహ రావు, 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, నాయకులు తంగెళ్ల రామచంద్రరావు, మైలవరపు దుర్గారావు, ఎండీ హబీబుల్లా, చిచ్చా, విశ్వనాథ రవి, కురాకుల నాగ, శీరం వెంకట్రావు పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యాభివృద్ధికి 'పోషణ్ పక్వాడా'



విద్యార్థినులతో మానవహారంలో పాల్గొన్న సూపర్‌వైజర్ ప్రశాంతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): కిశోర బాలికల ఆరోగ్యాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పోషణ్ పక్వాడా కార్యక్రమం దోహదపడుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్–1 సూపర్‌వైజర్ జి.ప్రశాంతి తెలిపారు. పోషణ్ పక్వాడా ద్వారా అందించే పౌష్టికాహారంతో వారిలో ఉండే రక్తహీనత, బరువు వంటి లోపాలను నివారిస్తోందన్నారు. విద్యాధరపురం లేబర్‌కాలనీలోగల జీఎస్ఆర్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. పోషకాహార లోపాన్ని నిర్మూలించడంలో మినుముల పాత్ర కీలకమైనదన్నారు. యుక్త వయసులో ఉన్న బాలికలకు రక్తహీనత, రుతు క్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే చిరుధాన్యాల వలన కలిగే ప్రయోజనాల గురించి వారికి వివరించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్స్ స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి ప్రతి ఇంటిని సందర్శించి రక్తహీనతతో బాధపడుతున్న కిశోర బాలికలను గుర్తించాలని చెప్పారు. అలాగే వారికి రోజువారీ తీసుకునే సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. తొలుత పాఠశాల ఆవరణలో విద్యార్థినులతో మానవ హారం, అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బి.లక్ష్మి, కె.లక్ష్మి, కె.బాజీ, జి.పావని, బి.నాగమణి, ఎంఎస్‌కెలువి.రాజ్యలక్ష్మి, కె.మహేశ్వరి, ఎస్.చంద్రిక, పద్మిని, ఆయాలు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట బంగారయ్య కొట్టు బూస్టర్ సమీపంలోని శ్రీ శివనాగ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన శివనాగ మందిరంలో విఘ్నేశ్వర, షణ్ముఖ, అయ్యప్ప స్వామి, ఆంజనేయ స్వామి, మహాలక్ష్మి, దుర్గా మల్లేశ్వర స్వామి, జంట నాగులు, షిర్డి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. మందిర గురుస్వామి బెవర రాము ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు దేవిలక్ష్మీ నారాయణాచార్యుల శిష్యబృందం విగ్రహ ప్రతిష్ఠ జరిపించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజక వర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, బుల్లా విజయ్‌కుమార్, గోదావరి గంగ, అత్తులూరి ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. అనంతరం పూర్ణాహుతితో ఉత్సవాలు ముగిశాయి. భక్తులను అన్న ప్రసాద వితరణ జరిగింది. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను దేవస్థాన కమిటీ అధ్యక్షుడు బెవర రాము, ఉపాధ్యక్షుడు సామా వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శి అయితా కృష్ణకిశోర్, రాయన రాము, బెవర వెంకట్రావు, కోళ్ల నాగేశ్వర రావు, పిళ్లా సూరిబాబు, అడ్డూరి రాము, పేర్ని కృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఐసీడీఎస్ ప్రాజెక్ట్–1 విజయవాడ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త పోస్ట్ భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి టి.నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ వన్‌టౌన్‌లోని మహంతిపురం–1(ఓసీ/53వ డివిజన్)లో అంగన్‌వాడీ కార్యకర్త పోస్ట్‌కు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఆ అంగన్‌వాడీ కేంద్ర పరిధికి చెందిన వివాహితురాలైన అభ్యర్థినులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 94408 14595 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో బ్లాక్ డే



లబ్బీపేట(విజయవాడ తూర్పు): రాజస్థాన్‌లో వైద్యులపై పోలీసులు లాఠీఛార్జిని నిరసిస్తూ ఐఎంఏ దేశ వ్యాప్తంగా నిరసనలకు పిలుపునివ్వడంతో విజయవాడ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్యులు నల్ల బ్యాడ్జిలు ధరించి బ్లాక్ డే పాటిస్తూ నిరసన వ్యక్తం చేశారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలు వద్ద నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎంఏ రెహమాన్, డాక్టర్ దుర్గారాణిలతో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రెహ్మాన్ మాట్లాడుతూ.. సరైన నియమ నిబంధనలు రూపొందించకుండా, రాజస్థాన్ ప్రభుత్వం ఆరోగ్య హక్కు చట్టం తీసుకు వచ్చి, ప్రైవేటు ఆస్పత్రిల్లో అత్యవసర వైద్యం అందరికీ అందించాలని పొందుపరిచారన్నారు. వైద్యానికి అయ్యే ఖర్చు ఎక్కడి నుంచి ఇస్తారు, ఎవరు ఇస్తారు అనేది స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. అప్రజాస్వామిక, నిరంకుశ చట్టాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఐఎంఏ బ్లాక్ డేను పాటిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. కల్యాణోత్సవంలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణం జరిపించుకున్న భక్తుల ఇంట ఆర్థిక ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు పెళ్లి కాని వారికి పెళ్లి, సంతానం లేని వారికి సంతాన భాగ్యం కలుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. అనంతరం ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

గిరిప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆటోనగర్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఏప్రిల్ 4వ తేదీ రాత్రి 8 గంటలకు ఆటోనగర్ నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. అదే బస్సు రాత్రి 9 గంటలకు పీఎన్‌బీఎస్ నుంచి బయలుదేరుతుందని చెప్పారు. శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శిస్తారన్నారు. 6వ తేదీ ఉదయం 5 గంటలకు అరుణాచలం చేరి తరువాత గిరి ప్రదర్శన అనంతరం అదే రోజు సాయంత్రం అరుణాచలం నుంచి బయలు దేరి 7వ తేదీ ఉదయం 7 గంటలకు విజయవాడ చేరుతుందన్నారు. రాను పోను ఒక్కొక్క టికెట్‌కు సూపర్ లగ్జరీ బస్సుకు రూ.2,500లుగా చార్జి నిర్ణయించామని చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 73828 99266 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట గాంధీ బొమ్మ సెంటర్‌కు చెందిన ధనేకుల జీవనజ్యోతికి 2016లో జి.కొండూరు మండలం వెలగలేరుకు చెందిన శ్రీహరికి ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహ సమయంలో రూ.10 లక్షల కట్నం, ఇతర లాంఛనాలు భారీగానే ముట్టజెప్పారు. అయితే వివాహం అయిన కొంత కాలం నుంచి జీవన జ్యోతిని భర్తతో పాటు అత్తమామ, ఆడపడుచు వేధింపులకు గురి చేయసాగారు. సంతానం లేకపోవడంతో వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. దీంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ హౌసింగ్‌బోర్డ్‌కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని ఎంఐజీ–2 బ్లాకులు, పోలీస్ స్టేషన్ రోడ్, వీఎంసీ కల్యాణ మండపం ఏరియా, హెచ్ఐజీ బ్లాకులు, రిలయన్స్ ఫ్రెష్ ఏరియా, హెచ్ఆర్‌టీ సాయి నిర్మాణ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

సుబ్బరాయునికి విశేష పూజలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఇంద్రకీలాద్రిపై వేం చేసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. చైత్రశుద్ధ షష్ఠిని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలను చేపట్టారు. నూతన సంవత్సరంలో మొదటి షష్ఠి రోజున స్వామి వారికి విశేష కార్యక్రమాలను నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి అభిషేకాలను నిర్వహించారు. బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ఏకదశ ద్రవ్యాలతో విశేష అభిషేకాలను చేపట్టిన అనంతరం విశేష అలంకారం చేశారు. అదే విధంగా వల్లీదేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్బారావు పర్యవేక్షించారు.

పాత శివాలయంలో..

శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఉపాలయంలో స్వామి వారికి పలు విశేష వైదిక కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. శుద్ధ షష్ఠిని పురస్కరించుకొని అభిషేకాలను జరిపారు. అదేవిధంగా ప్రత్యేక అర్చనలను చేపట్టారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారిణి హేమలతాదేవి పర్యవేక్షించారు.